


# గుణాంతరం

## – నవులూరి వెంకటేశ్వరరావు

### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### బహుమతి పొందిన ఉత్తమ నవల
### (గత సంచిక తరువాయి)

"నేను ఒక పథకం వేశాను కృపా గారు," అన్నాడు అనంతం..

"కృతజ్ఞుణ్ణి."

"కానీ డబ్బు ఖర్చు పెట్టాల్సి ఉంటుంది."

"సంసారం కన్నా డబ్బు విలువైందని అనుకోవడం లేదు."

"నేనూ అలా అనుకోక పోవచ్చు ఇలాంటి సందర్భంలో. కానీ 50 ఎకరాల ఆస్తికి సంబంధించిన విషయంకూడా ఇది."

"అలా అనుకోడం మీ ఇష్టానికి సంబంధించిన విషయం."

"మీరివ్వబోయే డబ్బు లో సింహభాగం వేరే వాళ్లకు చెందుతుంది మీ కార్యం చక్కబెట్టడంలో. కొంచం నా అవసరాలకు వాడుకుంటాను. తనకుమాలిన ధర్మం కూడదు."

"చెప్పండి; ఎంత ఇవ్వమంటారు? రేపు బ్యాంకు నుండి తెచ్చి ఇస్తా."

మరుసటిరోజు పొద్దునే డబ్బు తెచ్చి ఇచ్చాడు. అందమైన కన్నెపిల్లల్లా కనిపించే కొత్త నోట్లకట్టలు. అనంతం వేళ్ళతో వాటిని నిమురుతుంటే కళ్ళు మూతలు పడ్డాయి.

"సాయంత్రం మీకు నా ప్రగతి నివేదిక ఇస్తాను."

కృపా వెళ్లిపోయాడు రోడ్డు మీదకి, కానీ ఎక్కడికి వెళ్లాలో తోచలేదు.

## 7. తిర్యగ్యోని

అతను అధికారి, అతనికన్నా నాలుగు మెట్లు దిగువనున్న ఉద్యోగి ఆమె. స్త్రీ లోలుడు అని గుర్తించింది. తన పదవి ఆసరాగా కుతి తీర్చుకోవడానికి అవకాశం ఉండాలే గాని అన్వేషణా లోపం ఉండనీయడు. అతని దురదృష్టం కొద్దీ అతను అధికారం వీలున్న మేరకు చెలాయించడానికి ఆ విభాగంలో సుమతి కాక మరో నలుగురు మహిళలున్నారు. ఒక ఆమె సంవత్సరంలో పదవీ విరమణ చేస్తుంది, మరో ముగ్గురు యాభై ఐదు సంవత్సరాలకు ఒకటి రెండేళ్లు అటుఇటుగా ఉన్నారు. సుమతిది పదుచు ఆడశరీరం. అది అందుబాటులో ఉన్నది. దాన్ని లొంగ తీసుకోగలడం గర్వకారణం. లైంగిక అనుభవం ఆనందదాయకం. అందచందాలపట్టింపు అతనికి లేదు. ఒకవేళ అవి కలిసొస్తే అంతకన్నా కావల్సిందేముంది? అధికారం అనుభవించడానికి మాత్రమే ఉన్నది అన్న భావన ప్రభుత్వ యంత్రాంగానికి ఉంది. ఆ మనిషికి స్త్రీని లొంగదీసుకుని అనుభవిద్దామని కూడా ఉంటే సమాజానికి హాని.

రాయుడు అధికారిగా ఆ కార్యాలయంలో అడుగుపెట్టిన నాడే మిగతా స్త్రీల పట్ల ఒక దృష్టి సుమతి పట్ల మరొకటి ఏర్పర్చుకున్నాడు. గుచ్చిగుచ్చి చూసే అతని చూపులలోని తృష్టను పసిగట్టింది సుమతి. అతను అచ్చు కొట్టిన ఆంబోతుల వెన్నంటుతాడని భావించలేదు. తీరని తృష్ణ ఉన్నప్పుడు ఏ వెలయాళ్ల దగ్గరకో పోవచ్చు కదా. సాటి ఉద్యోగులను వేటాడడం ఎందుకో అనుకున్నది. వెలయాలికి, మరొకరి ఆలికి ఉన్న తేడా రాయుడికి తెలుసు. లొంగ తీసుకోవడంలో అలా చేసి అనుభవించడం అతనికి రంజుగా ఉండడమే కాక, చెడిపోకుండా ఉన్న వాళ్లను చెరచడంలో గర్వం, ఆత్మ సంతృప్తి ఏవో ఉన్నాయి. ఆమె మరో భవనంలో ఉన్నా బంట్రోతు చేత ఫోన్ చేయించి ఆఫీసు పని మీద ఏదో ఫైలు పట్టుకుని రమ్మనే వాడు. నిజానికి ఆమెను అతను పిలిచి ప్రత్యక్షంగా పనిని చక్కబెట్టవలసిన అవసరం లేదు. తన కింద, ఆమె మీద ఉన్న ఉద్యోగులు లేక అధికారులతో అతను మాట్లాడుకోవచ్చు. మిగతా దిగువస్థాయి ఉద్యోగులను దరిదాపుకు రానీయడు. సుమతికి మాత్రమే ఆ గౌరవం దక్కింది. చౌకబారుగా ఉండేది తీరు. చేతులు తాకడం, ఏదైనా వివరణ అవసరమైనప్పుడు టేబుల్ అవతలికి వచ్చి తన కుర్చీ పక్కన నిలబడి మాట్లాడమనటం, ఆమె చేసిన దాంట్లో తప్పులు ఎన్ని తన తెలివితేటలు ప్రదర్శించడం, ఇంత చిన్న విషయం కూడా తెలీదా అని చులకనగా మాట్లాడటం... మొదట్లో ఆమెకు ఆందోళనతో నిద్రపట్టలేదు. ఉద్యోగం మానేద్దాం అనుకున్నది. ఆర్థికంగా దాని మీద ఆమె ఆధారపడి లేదు. కానీ ఒక ప్రభుత్వ ఉద్యోగాన్ని ఒక మనిషికి భయపడి వదిలి వేసుకోవడం అంతా వివేకమైన పనిగా తోచలేదు. కృపాతో విషయం చెబుదామనుకుంది. అతను అంత ఆలోచనాపరుడు కాదు. ఏదోలా సర్దుకుపో, అన్ని వేల డబ్బు నెలనెలా తెచ్చిపెట్టే ఉద్యోగాన్ని వదిలి వేస్తా నంటావేమిటి అని ఒక అవివేకిని వివేకవంతుడు ఆశ్చర్యంగా చూసినట్లు చూస్తాడేమోనని భయం.

సహచరులకు ఎలాగూ అన్ని విషయాలు తెలుస్తూనే ఉంటాయి – చెబితే వాళ్లవద్ద చులకన పడడం తప్ప కలిసికట్టుగా అధికారిని నిలవేయడానికి ఎవరూ రారు. మేమెందుకు కలగ చేసుకోవాలి అన్న ప్రశ్న వాళ్ళకు వాళ్ళు

వేసుకుంటారు; సంఘంలో జరిగే ప్రతి అన్యాయం పట్ల ఉండే సాధారణ వైఖరికి అనుగుణంగా. తను ఒకవేళ రాతపూర్వకంగా ఫిర్యాదు ఇద్దామంటే అది రాద్ధాంతం అవుతుంది; రుజువులు, సాక్ష్యాలు కావాలి. అధికారి పట్ల ఏదైనా అపకారం జరిగితే అతని పట్ల సానుభూతి ప్రకటించే వాళ్ళు అధికంగా ఉండొచ్చు. పురుషులలో ఎక్కువమంది పురుషుడి వైపే నిలబడతారు. ఒకసారి స్త్రీల పట్ల జరిగే లైంగిక వేధింపుల మీద చర్చ జరిగింది భోజనాల హాల్లో– ప్రియదర్శిని, శాంతమ్మ, కళ, విజయ, సీత వగైరాలు  మాట్లాడుతుంటే తాను గొంతు కలిపింది. వాళ్లు ఒక కరపత్రం లో ఉన్న విషయాల గురించి ముచ్చటించుకుంటూ ఉన్నారు. అది ప్రియదర్శిని చేతిలో ఉంది. అంతకుముందే మిగతావాళ్లు చదివేసి నట్లున్నారు. వచ్చి కూర్చోగానే సుమతికి ఇచ్చింది ఆ వింత ఆమెకూ పంచిపెడుతూ. ముప్పై మంది ఆడ పేర్ల జాబితా, దానికి ఎదురుగా ముప్పై మంది మగ పేర్ల జాబితా ఉంది. ఆ జాబితా చదవక్కరలేదు. దానిపై నున్న నాలుగైదు పంక్తులు చదివితే సరిపోతుంది. దాని ప్రకారం పక్కన ఉన్న పదివేల మంది ఉద్యోగులూ, కార్మికులు పనిచేస్తున్న సంస్థలోని ఉద్యోగినులు ఉద్యోగులు అరవై ఐదు మందివివిధ విభాగాలకు చెందిన వాళ్ళు. అవి ప్రేమికులు అని చెప్పబడిన జంటలు. ఇద్దరు మినహాయిస్తే మిగతా వాళ్ళు వివాహితలు.

"నిజంగా వైవాహికేతర సంబంధాలు ఎంత మంది ఆడవాళ్ళు కలిగి ఉన్నారు అంటే నమ్మ గలమా?" ప్రియదర్శిని అనింది ప్రత్యేకంగా ఎవరిని ఉద్దేశించకుండా.

"ఆధార రహితంగా దాన్ని ముద్రించి మరీ వాళ్ళ సంస్థలో కాక మిగతా వాళ్ళకి వాటిని పంచిపెట్టడం లో వాడి ఉద్దేశం ఏమయ్యి ఉంటుంది?" వకుళ అన్నది.

"వాడు అంటున్నారు మన స్త్రీజాతికి ఆ పని సాధ్యం కాదనా, పురుష జాతి కన్నా మనం సంస్కారవంతులమన్న నిశ్చితాభిప్రాయమా? అలాంటి సామర్థ్యం మనకు కొరవడిందా?" సీతమ్మ అనింది.

"అలాంటి నీచమైన పనికి మనం ఒడిగట్టగలమని కానీ, ఒడికడతామని కానీ కలలో కూడా నేను అనుకోను," ప్రియదర్శిని అనింది.

"ప్రియదర్శిని గారితో నేను పూర్తిగా ఏకీభవిస్తున్నా," అనింది సుమతి.

"ఎవడేస్తేనేమి గాని అది ఏమాత్రం నిజం కాదని మనం అనలేం. ఆ సంస్థలోనే మరో విభాగంలో పనిచేసే మా దూరపు బంధువు, వయసులో పెద్దామె రెండు మూడు సార్లు కొందరి గురించి చెప్పింది," కళ అనింది.

"పోనీ ముప్పై మందిలో ముగ్గురే అలాంటి సంబంధాలు నిజంగానే ఉన్నాయనుకుందాం. సమర్ధించ గలమా?" శాంతమ్మంది.

"మగాడి వివాహేతర సంబంధాలను మనస్ఫూర్తిగా మనం సమర్ధించ గలిగితే, ఆడవాళ్ళవి మాత్రం ఎందుకు సమర్ధించ కూడదు?" వకుళ అన్నది.

"మగ పురుగు కుండే మాయదారి రోగం జగద్వితం. మరి స్త్రీ కూడా అలాంటి దానికి పాల్పడడానికి ఏ కారణాలు ఉంటాయి?" సీతమ్మ అనింది.

"మగవాడి కుండే రిమ్మతెగులులో సగమన్నా ఆడదానికి ఉండదా? అయినా స్వలింగ సంపర్కం పెట్టుకునే మగవాళ్ళను వదిలేస్తే – మిగతావాళ్లు ఎవరితో సంబంధాలు కలిగి ఉంటున్నారు? ఆడదానితోనే కదా?" వకుళ అనింది

"అందులో లైంగికంగా వాళ్ల పై మగవాళ్ళ ఒత్తిడి ఎంతుందో మనకు తెలీదు కదా; బ్లాక్ మెయిల్ లాంటిది." సుమతి అంది.

"కాస్తోకూస్తో వేధింపు తప్పదు పని స్థలంలోనే కానీ, రోడ్డు మీద కాని. అయితే ఆ పురుషులకు పూర్తిగా లొంగిపోయెంతగా కొందరి విషయంలోనే మగాళ్ల ఒత్తిడుంటుంది. లొంగి పోకపోతే మగ ఉద్యోగులు  అందరూ ఆడ ఉద్యోగులకు ఉద్యోగరీత్యా హాని చేయగల స్థితిలో ఉంటారని అనుకోలేం." ప్రియదర్శిని అన్నది.

"పైగా ఆ ఆడవాళ్ళు తమ కన్నా దిగువస్థాయి ఉద్యోగస్థులతో సంబంధాలు కలిగి ఉండొచ్చు కూడా," విజయ అనింది.

"అతి సాధారణ సత్యం ఏమిటంటే ఆడది పురుషుడికి భోజ్య వస్తువు, భోగ్య వస్తువు. అందరూ మగవాళ్లను ఎదిరించి వాళ్ళ ఆత్మగౌరవాన్ని కాపాడుకోగల శక్తివంతులు కాకపోవడం దౌర్భాగ్యం," కళ అనింది.

"అక్రమ సంబంధాల విషయంలో అహానికి, ఆత్మగౌరవానికి ఎంత చోటు ఉందో తెలీదు," వకుళ అన్నది.

"నేను లైంగిక పవిత్రతను ఎట్టి పరిస్థితుల్లోనూ కోల్పోనన్న నిర్ణయానికి కట్టుబడుంటే, ఉద్యోగ సంబంధంగా ఆ పవిత్రతకి భంగమయ్యే పరిస్థితి ఏర్పడితే ఉద్యోగాన్ని వదిలి వేసుకోవచ్చు. శీలంకన్నా డబ్బును  తెచ్చే ఉద్యోగం మిన్న అనుకుంటే లొంగి పోవచ్చు," సీతమ్మ అనింది.

"ఉద్యోగం గురించి శీలాన్ని ఎందుకు కోల్పోవాలి? దేనికదే. అదా ఇదా అన్న ప్రసక్తి రానీయకూడదు. పోరాడటం కావాలి. అది కదా అసలైన వ్యక్తిత్వమంటే? జీతంరాళ్లమీద ఆధారపడి జీవిస్తున్నవాళ్లకు నా మాటలు కొట్టిపారేయదగినవి అనిపించవచ్చు," సుమతి అనింది.

"లైంగిక బలహీనత స్త్రీకీ ఉంటే అదా ఇదా అన్న మీమాంస ఎదురే అవదు." ప్రియదర్శని అంది.

"అవును. నాకు శీలం తో పని లేదు. అలా ఉండాలంటే ఉండే హక్కు నాకుంది అని పెడసరంగా అనుకోవడంలో తప్పు పట్టగలమా?" అంతవరకు చర్చించినదంతా మౌనంగా వింటూ అప్పుడప్పుడూ తల ఊపుతూ వచ్చిన గౌరీదేవి అంది.

"లైంగిక శీలానికి ఇచ్చిన ప్రాధాన్యత లైంగికేతర శీలానికి మనం ఇవ్వడం లేదు," సుమతి ఆనింది.

"మనం కేవలం పనిచేసే చోట ఉండే పురుష ఆధిపత్యం గురించి మాత్రమే చర్చిస్తున్నాం. అత్యాచారం, వీధిలో జరిగే లైంగిక వేధింపు గురించి దృష్టి సారించామంటే మన గుండెలు చెరువులవుతాయి, అవి అందరికీ అనుక్షణం

వింటున్న, చూస్తున్న, ఎదురవుతున్న, చదువుతున్న, భయంకరమైన అనాగరికమైన సమస్యలు. పురుష జాతి ఉన్నంత వరకు తొలగనివి," సీతమ్మంది.

"సంస్కృత భారతంలోని కీచకవధ గురించి చెబుతాను," అనింది ప్రియదర్శిని.

ఆమె ఆకాశవాణిలోనూ, టీవీ చానల్లలోనూ ఆధ్యాత్మికోపన్యాసాలు ఇస్తుంది. సమయం దొరికితే కులసేవా చేస్తూ భర్త వ్యవహారాలలో సహకారం అందిస్తుంది.

"అజ్ఞాతవాసం సంవత్సరం పాటు ఎక్కడగడపాలీ అని ధర్మరాజు ప్రశ్నవేసినపుడు పదమూడు రాజ్యాలపేర్లు అర్జునుడు చెబుతాడు. వాటిలో విరాటరాజ్యాన్ని ఎంపిక చేశాడు ధర్మరాజు. కారణం విరాటరాజు సుగుణవంతుడు, బలవంతుడు, దాతృత్వబుద్ధి కలవాడు. ముసలివాడు కావడం కూడా ఒక కారణమేమో తెలియదు. కొలువును చేరబోయేముందు మన ప్రియమైన భార్య మన ప్రాణంకన్నా విలువైనది అంటాడు ధర్మరాజు. సుధేష్ణ శైరంధ్రి అంగాంగాలను పరిశీలించి అచ్చరువుచెందడమే కాక ఇలా అంటుంది ఆమెతో – 'రాజు నిన్ను అభిలషించకుండా, నీ పట్ల హృదయపూర్వకంగా ఆకర్షితుడవ్వకుండా ఉండేట్లయితే నిన్ను నా శిరస్సుమీద పెట్టుకుంటా నిస్సందేహంగా. నిన్ను మోహించని పురుషుడు ఎవడన్నా ఉంటాడా?' అని 'చక్కని రూపం సంతరించుకున్న పిరుదులు కలదానా' అని సంబోధిస్తుంది. విరాటుడే గాని, మరొకడెవరైనాగాని నన్ను పొందలేరు ఎందుకంటె నా భర్తలయిన ఐదుగురు గంధర్వుల రక్షణ నాకుంది అని శైరంధ్రి సుధేష్ణకు హామీ ఇస్తుంది. విరాటుడు ఏ కారణం వలననో – వయసు అడ్డొచ్చిందేమో తెలియదు – ఆమె జోలికి వెళ్ళలేదు. కీచకుడు మాత్రం ఆమెను చూసి మతిపోగొట్టుకున్నాడు; వయసూ అతనికి అడ్డురాలేదు. 'ఈమె తన అందంతో నన్ను పిచ్చెక్కిస్తోంది సుర తన వాసనతో మత్తెక్కించేట్లు,' అన్నాడు. నా పాత భార్యలందరినీ ఈమె గురించీ ఒదిలేయడానికి సిద్ధంగా ఉన్నాను; వాళ్లందరితో నీవు పరిచర్యలు చేయించుకోవచ్చు అన్న సూచనకూడా శైరంధ్రికి చేశాడు. ఆమె పంజరంలో చిలక. పిల్లి పంజరంలోకి వచ్చి భక్షిస్తా నంటోంది. విరాటుడు ఆమె వెనకాపడకుండా ఉండాలంటే తమ్ముడు ఆ పని చెయ్యడం తనకు శ్రేయస్కరం అని సుధేష్ణ భావించిందేమో! తమ్ముడి అంతఃపురానికి వెళ్లి అతను చేయించుకున్న మధురపదార్థాలూ, సుధేష్ణ దాహం తీర్చడానికి అతనిదగ్గిరున్న ప్రత్యేకమైన సురను తెమ్మని పంపింది; భయపడవద్దని భరోసా ఇచ్చి. సేవకురాలిగా మారిన రాణికి గత్యంతరం లేక వెళ్ళింది. అతన్ని మాటలని పరిగెట్టబోయిన ఆమె రవికను వెనుకనుంచీ పట్టుకుని లాగాడు బలంగా. ఆమె కూడగట్టుకున్న శక్తితో అతన్ని క్రిందపడేట్టు చేసి రాజు కొలువై ఉన్న సభలోకి పరిగెత్తింది రక్షణకు. దుస్తులిచ్చిన కృష్ణుడిది తప్ప కురుసభలోనే ఏ రక్షణా లేకపోయింది. ఇక్కడా అంతే – ధర్మరాజు, విరాటుడు చాలా ముఖ్యమైన పనిలో మునిగి ఉన్నారు. దానిపేరు పాచికలాట. సభికులందరూ చూస్తుండగా కీచకుడు సైరంధ్రిని జుట్టుపట్టుకుని కిందికి లాగి కాలితో తన్నాడు. కీచకుడిని చంపాలన్న ఉద్రేకంలో భీముడు పళ్ళు కొరికాడు. అతని ముఖకవళికలు మారాయి. వెళ్లి కట్టెలు ఏరుకో అని తమ్ముడికి చెప్పాడు ధర్మరాజు బొటన వేళ్ళతో సంజ్ఞ చేస్తూ. అన్న ఆనతిని గ్రహించాడు. కోపోద్రేకంలో అక్కడున్న చెట్టును

తొండంతో పైకి పీకి పట్టుకున్న గజంలా తోచాడు భీముడు. రాజు కీచకుడిపట్ల రాజులా ప్రవర్తించలేదు, అన్నది శైరంధ్రి: 'ఓ రాజా, ఈ రాజ్యసభకు తగినవిధంగా నీవు నడుచుకోలేదు. నీ ప్రవర్తన బందిపోటు ప్రవర్తనలా ఉంది.' కీచకుడిని ఏమీ చెయ్యలేని దద్దమ్మ రాజు. శైరంధ్రికి రాజనిందకు గాను ఉరిశిక్ష రాజు వెయ్యలేదు అదృష్టవశాత్తు. ధర్మరాజు తొలుత భావించినట్టు విరాటుడు దాతృత్వ బుద్ధి కలవాడేనేమో! ఐతే, కీచకుడి జోలికి వెళ్ళడానికి భయపడిన విరాటుడు ధర్మరాజు భావించి ఉన్నట్టు శక్తివంతుడుగా కాక బలహీనుడిగా తేలిపోయాడు. ఆమె రాజ్యాన్నే కాక రాజ్య సభలో పరివేష్టులైన వాళ్ళనూ నిందించింది. వాళ్ళు ఆమె సచ్చీలతను పొగిడారు. ఆమె భర్తలు ఎవరోగాని అదృష్టవంతులు అన్నారు. మీ ఇద్దరిమధ్య నా వెనుక ఏ గొడవ జరిగిందో నాకు తెలియదు; ఈ వృత్తాన్తమ్ పూర్వ పారాలు తెలియకుండా నేను ఏమి చెప్పగలనూ అని విరాటుడు తన తెలివితేటలను ప్రదర్శిస్తూ పిరికితనాన్ని మరుగుపరిచే యత్నం చేశాడు. ఆమెను దేవతతో పోల్చాడు కూడా. అది ఏ ఊరట, ఏ గర్వం ఆమెకు కలిగించాయో మనకు తెలియదు. వాళ్ళు ఆ విధమైన పొగడ్తలతో ఆమెను ముంచేస్తుండగా, కోపంతో ధర్మరాజు నుదుటి మీద ముచ్చెమటలు పోశాయి. కోపం భార్యను పొగిడినందుకో కీచకుడు తన భార్యపట్ల అనుచితంగా ప్రవర్తించినందుకో ; భార్య అనుచితంగా సభలో ప్రవర్తించి వాళ్ళ అజ్ఞాత వాసానికి ముప్పు తీసుకురాబోయినందుకో. భార్యను మందలిస్తూ అన్నాడు: 'ఓ శైరంధ్రీ, సభలో ఉండక; సుధేష్ణ గారి అంతఃపురానికి పో. వీరుల భార్యలు భర్తల గురించీబాధను భరించాలి... నీవు గౌరవనీయమైన కుటుంబంలో పుట్టావు. పవిత్రమైనదానివి. పుణ్యకార్యాలు ఆచరించేదానివి. పాపం అంటే నీకు తెలియదు. అందుచేత నిన్ను దుర్మార్గమైన మనసులు కల పాపాత్ములైన మగవాళ్ళు నిన్ను చూసి ఆనందించే వీలులేకుండా నడుచుకో. భర్తలకు సేవలు కష్టపడిచెయ్యాలి. వాళ్ళకు చివరకు ఏ గతులు ఏర్పడతాయో అక్కడికి వాళ్ళను అనుసరించి పోవాలి,' అని బోధిస్తూ పరోక్షంగా అనునయిస్తూ 'నీకు ఏ పని ఎప్పుడు జరగాలో తెలియని అజ్ఞానంకారణంగా ఒక నటిలా ఏడుస్తున్నావు.' సుధేష్ణ అంతఃపురానికి వెళ్ళిపోయింది ద్రౌపది. అంతసేపు దుఃఖించిన కారణంగా ఆమె ముఖం సూర్యబింబంలా కనిపించసాగింది. సుధేష్ణతో [ఆమె అడగగా] జరిగిన పరాభవం గురించి చెప్పి రాజుముందు నిలబడినపుడు ఒంటరిగా అడవిలో ఉన్నట్టు అనిపించింది అంటుంది. ఆ రాత్రి భీముడి దగ్గిరికి వెళ్ళింది. నిద్ర తీయదనాలను ఎలా అనుభవిస్తున్నావయ్యా అని మందలిస్తూ ఏడ్చింది. సింహంలా గుర్రుపెడుతూ నిద్రిస్తున్నాడు. గోమతి నది ఒడ్డునున్నపెద్దది, ఎత్తైనదీ అయిన సాల్ చెట్టును అల్లుకున్న తీగవోలె అతన్ని అల్లుకు పోయింది ఆమె. చేతులతో అతన్ని చుట్టిపట్టుకుని మంచం మీది నుంచీ ఆడసింహం, నిద్రించే మొగ సింహాన్ని లేపినట్టు లేపింది.

'చనిపోయినవాడిని తలపిస్తోంది నీ నిద్ర,' అనింది. 'దేనిగురించి నా దగ్గిరకు వచ్చావు ఇక్కడికి?' అన్నాడు. 'ధర్మరాజు లాంటి భర్త ఉంటె కష్టాలనుంచీ స్వేచ్ఛ ఎక్కడిది?' అనింది. ఆ తరువాత తన కడగళ్లు చెప్పింది; ధర్మరాజు వలన మిగతా భర్తలకు కలిగిన దుస్థితిని వివరించింది. భీముడు తనను గతంలో తనపై దాడిచేసినవాళ్ల నుంచీ ఎలా రక్షించింది పొగుడుతూ చెప్పింది. అయితే భీముడు ధర్మరాజును నిందించవద్దన్నాడు. నీ నిందలు వింటే ప్రాణం

తీసుకుంటాడు అని చెప్పాడు. ఆయన ఆ పని చేస్తే మిగతా నలుగురం జీవించి ఉండం అని హెచ్చరించాడు. కృష్ణుడు సర్పాన్ని సరసు నుంచీ బయటకు లాగి ఎలా మర్థించాడో అలా కీచకుడిని మర్దించి చంపమని రెచ్చకొట్టింది. కీచకుడి తలను తొండంతో ఏనుగు ఎలక్కాయను ఎత్తినట్టు పైకి ఎత్తుతానని భరోసా ఇచ్చి చెప్పినవిధంగా అతి ఘోరంగా, మాంసపు ముద్దగా మార్చాడు నర్తనశాలలో. అనుచరులు వచ్చి కీచకుడిని చూశారు – మెడ ఎక్కడుంది, రెండు కాళ్ళు ఎక్కడున్నాయి, తల ఎక్కడుందీ' అని ఒకళ్ళతో ఒకళ్ళు అనుకున్నారు. భీముడికి ఏ గాయమూ అయినట్టు తెలియదు."

"ఇంతకూ ఆ కథ ద్వారా ఏం చెప్పదలచుకున్నావు?" సీతమ్మ అడిగింది.

"ఎవరికి ఏమి తోస్తే దాన్ని గ్రహించవచ్చు. లేకపోతె కథను ఆనందించొ, ఆనందించకో రెండో చెవినుండీ ఒదిలెయ్యవచ్చు."

"తనను ప్రేమించడంలోనూ, కామించడంలోనూ, బలాత్కారముచేయబోవడంలోనూ క్షమించరాని నేరమే కీచకుడు చేసుండొచ్చు [నిజానికి ఆ నేరాలు ఏ పురుషుడూ ఎప్పుడూ చేయనివి కాదు] మాంసం ముద్దగా ఆ వ్యక్తి మిగిలిపోయిన తరువాత ఆమెలో ఏమీ అనిపించలేదా? ఎందుకో ఆ విషయమే కవి పట్టించుకోలేదు," సుమతి అనింది.

"నువ్ పట్టించుకుని ఎవరిచేతన్నా కవిత రాయించు."

"సరే అసలు ముగింపు చెప్పేస్తా. సైరంధ్రి క్లిష్ట పరిస్థితిలో బృహన్నల కలుగజేసుకోలేదు. కీచక వధ అయింది. అంతఃపురకన్యలను ఆమె కలిసింది. వాళ్ళతోబాటు బృహన్నల ఆమెతో మాట్లాడాడు. జరిగిందంతా వివరంగా చెప్పమన్నాడు. అతను లేక ఆమె అలా అడగడం ఆమెకు కోపం కలిగించింది. దుఃఖం సైరంధ్రిది గాని నీది కాదుకదా అందుకే ప్రహసించుచున్నావు; అంతఃపురకన్యలతో సుఖంగా ఉన్నావు అంది. అతను కీచక ఉదంతంలో జోక్యంచేసుకోలేదని ఆమె కినుకవహించినట్టు అర్థం అవుతుంది. బృహన్నల ఆమె అన్నదాన్ని తిప్పికొట్టాడు. నీచమైన యోనితో కూడిన దేహం ఏ పర్యావసానాలకు దారితీస్తుందో నీకు తెలియని విషయం కాదు; అది దుఃఖానికి హేతువు, [తిర్యగ్యోని గతా బాలే న చైనా మవబుధ్యసే] అన్నాడు. అంటే కీచక పర్వాన్ని ఆ అందగత్తె మీదికి తోసేశాడు. దాని కారణంగానే సింహబలుడైన కీచకుడు భయంకరమైన హత్యపాలవడమేగాక అతను నూట ఐదు సోదరులూ చచ్చారేమో."

"కీచకపర్వం నుంచీ నేర్చుకో వలసిన ముఖ్యమైన అంశాలలో పురుషుడి లైంగిక వేధింపులను తట్టుకుని లొంగిపోకుండా తగిన శాస్తి చెయ్యడం," సుమతి అంది.

"అన్నట్లూ, ప్రియా, ఇంతకాలం బూతు కథలు,పురాణ పుణ్య కథలు, పురాణ బూతులు చెప్పి మమ్మల్ని అలరించావు. పదవీ విరమణ తరువాత, నీ మనవలకు చెప్పి కాలక్షేపం చేస్తూ వాళ్ళనూఆనందింపచేస్తావా?"

"వాళ్ళ నోట కథలు వింటా."

"నీవు చాలా లోతైన మనిషివి."

"మా ఆయన అదే అంటుంటారు."

"అమ్మా, లైంగిక కార్యం స్త్రీ గౌరవాన్ని పెంచేదంటారా? ఆ పురుషుడు భర్తయినా – వాడు భార్యను ప్రాణప్రదంగా గౌరవించేవాడు, ప్రేమించేవాడే కావచ్చు," కళ అనింది.

"కానేకాదు. నా భర్తతో కలిసిన తొలిరాత్రి ఆ భావన కలిగింది. మరోలా చేయగలిగేదేముందీ? మనుషులూ పశువులే; కాకపోతే నిలువుగా ఉంటారు, రెండే కాళ్ళుంటాయి. మెదడుంది మాయ వేషాలెయ్యడానికి. పశు వాంఛను జయించడానికి పశువు తరమా?" గౌరీదేవి అనింది.

"స్త్రీ వేధింపు సమస్య కాస్తో కూస్తో అదుపులోకి తేవాలంటే మన తాతతండ్రులను, అన్నదమ్ములను, కొడుకులను అదుపులో ఉంచగలిగిన శక్తి ముందు స్త్రీకి ఉండాలి," సీత అనింది.

"హిపోక్రసి ఏమిటంటే మన కుటుంబ పురుషులు మన కుటుంబంలోని స్త్రీలపట్ల ఎలా ప్రేమానురాగాలతో గౌరవంతో వ్యవహిరిస్తారో దానికి భిన్నంగా వీధిలో మిగతా స్త్రీలపట్ల వ్యవహరిస్తారు," వకుళ అనింది.

"స్త్రీల వైఖరిలో మాత్రం ఆ విషయంలో తేడా ఉండదా? సొంత పురుషులు తప్పుచేసే రకం కాదు అన్న భావన ఆయా కుటుంబంలోని స్త్రీలకూ అంతర్లీనంగా ఉంటుంది. సొంత పురుషుడు వీధిలోని స్త్రీని వేధించి పట్టుబడితే వాడిని మనం వెనకేసుకురామూ, స్త్రీ జాతి సంఘటితతత్వానికి నువ్వులూనీళ్ళూ ఒదిలి?" ప్రియదర్శిని అనింది.

"మనం పురుషులను వేధిస్తున్నామా, వాళ్ళు మనలను వేధిస్తున్నట్లు?"

"ఏ దురాగతాన్నైనా ఇది మానవ జీవిత విధానం అని వైరాగ్యపూరితంగా సరిపెట్టుకోగలిగితే కొంత ప్రశాంతంగా జీవించవచ్చు."

"ఇష్టమైన పురుషుడు ఈల వేస్తే హా ప్రియా అంటూ దూసుకెళ్లే ఆడవాళ్లు లేరా?"

"అలా అని ఇష్టంలేని వాళ్ళు మన చెయ్యి పట్టుకున్నా ఊరుకుని, చేయి లాక్కుని అవతలికి వెళ్లిపోవాలా?"

"పురుషులంతా దుర్మార్గులయి పరాయిస్త్రీ పొందుకై పొంగ కార్చేవారయితే ఎవరమూ పతివ్రతలుగా, పవిత్రంగా మిగలము."

"మగవాడు పరాయిస్త్రీతో వెళ్ళినపుడు వాడిని బాధించని అంతరాత్మ, మనం అదేపని చేస్తే ఎందుకు బాధిస్తుందో?"

"మన అంతరాత్మ లోపం."

"మనలోనూ అందరి అంతరాత్మలూ పీడించవుగదా."

"స్త్రీ పురుషుల శరీర నిర్మాణ విధానాలు, మనసులు, లైంగికావయవ భేదాలు, శారీరక శక్తులు, జన్యుసంబంధ భేదాలు, గ్రంథులు, పెరిగే విధానం, సమాజ సంస్కృతీ లాంటివి వాళ్ళనూ మనలనూ ఒకే గాట కట్టేయనీయవు. కడుపులు

మనకు వస్తాయి, నెలసరి బాధ మనకుంటుంది. ప్రకృతిలోనే భయంకర వివక్షతుంది. నిజానికి అది అవసరమైన వివక్షతేమో."

"వికసించిన పువ్వులలాంటి మన జోలికి మగ పురుగులు పాకుతూ రావడాన్ని కాస్సేపు పక్కనుంచుదాము; పసిమొగ్గలనూ తమ కోరికలకు బలితీసుకుంటున్నారే."

"పసి మొగపిల్లలనూ ఆ జీవాలు వదలటంలేదే?"

"ఒక ఆఖరి కథ చెప్పెయ్యి," సీతమ్మ అడిగింది.

అందరూ చెవులు రిక్కించారు.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS